
మనం
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
శనివారం | 26 | ఆగస్టు | 2023 | పేజీలు : 9


## త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవనం

-రూ.4.44 కోట్లతో నూతన భవన నిర్మాణం
-నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి హరీష్‌రావు



2 లో

# పచ్చపచ్చగా

-రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కల పెంపకం
-జిల్లాలో 4 లక్షల 72 వేల మొక్కలు నాటడమే లక్ష్యం
-సమన్వయంతో మొక్కలు నాటాలి... హాజరుకానున్న మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట, ఆగస్టు 25, మనం న్యూస్ ప్రతినిధిః రాష్ట్ర వ్యాప్తంగా నేడు కోటి మొక్కలను నాటాలని ప్రభుత్వం నిర్ణయించినందున రాష్ట్ర మంతా పచ్చపచ్చగా మారనుంది. ఇప్పటికే జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్ష సమావేశాలు నిర్వహించి అధికారులు సమాయత్తమయ్యేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 4 లక్షల 72 వేల లక్ష్యాన్ని నిర్ధేశించగా ప్రతి గ్రామ పంచాయతీలో 860 మొక్కలు నాటేందుకు ప్రాంతాలను ఎంపిక చేసి దానికి అవసరమైన గుంతలు, సామాగ్రిని సిద్ధం చేశారు. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారుల సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటలకు రంగనాయక సాగర్ వద్ద మంత్రి హరీష్‌రావు పాల్గొని ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించనున్నారు. మండల స్థాయిలో ఎంపిపిలు, జెడ్పిటిసిలు మొక్కలు నాటే





కార్యక్రమంలో పాల్గొననున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవ ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఒకేరోజు కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించగా అందులో భాగంగా నేడు మొక్కలు నాటనున్నారు. దశాబ్ధి సంపద వనాల కింద మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలని, వచ్చే వారం నాటికి ప్రతి జిల్లాలో 90 శాతానికి మొక్కలు నాటించాలని గడువుగా విధించినట్లు, నాటిన మొక్కను సంరక్షిం చబడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## వరాలనొసగే వరలక్ష్మీ వ్రతం

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

8 లో



## ధరణి పెండింగ్ దరఖాస్తులు
# త్వరగా పరిష్కరించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



పాపన్నపేట, ఆగస్టు 25, మనం న్యూస్ః జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజున సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్‌లతో ఆయన వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని, ధరణిలో కొత్త ప్రొఫార్మా ప్రకారం నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 1 నుండి 59 జిఓ ప్రకారం 10 లక్షల కన్నా అధికంగా ఉన్న రెవన్యూను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 58 జిఓ ప్రకారం రెవెన్యూ పూర్తిగా చెల్లించిన వారికి పట్టాల పంపిణీ చేయాలని, గృహలక్ష్మి అర్హులకు ఇండ్ల స్థలాల పంపిణీకి ప్లాట్ పొజిషన్ చూపించాలన్నారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో పట్టాలు పంపిణీ చేయాలన్నారు. గృహలక్ష్మి దరఖాస్తులు మిగతా 2లో..

## త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవనం



సిద్దిపేట, ఆగస్టు 25, మనం న్యూస్ ప్రతినిధిః దినదినాభివృద్ధి చెందుతున్న సిద్దిపేట పట్టణంలో ఇప్పటికే రూరల్, వన్ టౌన్, టూన్ టౌన్ తోపాటు గత కొద్ది రోజుల క్రితం సిద్దిపేట పట్టణ పరిధి పెరిగిన దృష్ట్యా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తాత్కాలిక భవనంలో సాగిస్తుండగా త్వరలో శాశ్వత భవనం నిర్మించేందుకు అడుగు పడింది. శాంతి భద్రతల పరిరక్షణ కోసం సిద్దిపేట పట్టణ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు రక్షణ, సౌకర్యార్థం నూతన శాశ్వత భవన నిర్మాణానికి నేడు మంత్రి హరీష్‌రావు రంగధాంపల్లి శివారులో కేటాయించిన స్థలంలో శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు గాను రూ. 4.44 కోట్లతో నూతన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పనులకు నేడు శంకుస్థాపన చేయడం జరుగుతుంది. కాగా దీన్ని మోడల్ పోలీస్ స్టేషన్‌గా అధునాతన సౌకర్యాలతో నిర్మించనున్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

### -యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### -పోలీస్ కమీషనర్ శ్వేత



సిద్దిపేట, ఆగస్టు 25, మనం న్యూస్ ప్రతినిధిః యోగా చేయడం ద్వారా ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని జిల్లా పోలీస్ కమీషనర్ శ్వేత అన్నారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో పోలీస్ అధికారులకు యోగ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి శ్వేత మాట్లాడుతూ పోలీస్ అధికారులకు ప్రత్యేకంగా 60 రోజుల పాటు యోగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య పరిరక్షణలో యోగాసనాలు అద్భుత ఫలితాలు అందిస్తాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంత్రి హరీష్‌రావు చొరవతో సిద్దిపేట మెడికల్ కళాశాల వైద్యు సహకారంతో జిల్లాలోని ప్రతి పోలీస్‌కు హెల్త్ ప్రొఫైల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వాకింగ్, రన్నింగ్, స్విమ్మింగ్ చేయలేని వారికి వారానికి నాలుగు రోజులు 60 రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు మల్లారెడ్డి, సుభాష్ చంద్రబోస్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, త్రీ టౌన్ సిఐ భాను ప్రకాష్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి..

పెండింగ్‌లో ఉంచవద్దని, ఎంపిడిఓలు, తహసాల్దార్‌లు, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. 59 కింద అర్హత కలిగి ఉన్న వారు డబ్బు చెల్లించని యెడల ప్రభుత్వ బోర్డులేర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు అంబదాస్, రాజేశ్వర్, జయచంద్రారెడ్డి, ఎన్నికల సమన్వయకర్త రాజిరెడ్డి, తహసీల్దార్‌లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి కొమ్మూరి ఆర్థిక సాయం



చేర్యాల, ఆగస్టు 25, మనం న్యూస్ః చేర్యాల పట్టణానికి చెందిన పాక రాములు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ డిసిసి అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అధైర్య పడవద్దని భరోసానిచ్చారు. ఆయన వెంట నాయకులు ఉడుముల భాస్కర్‌రెడ్డి, మంజే మల్లేశం, ఉట్లపల్లి శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్, నీలం సన్ని తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలి

### రెండవ ఏఎన్‌ఎంల నిరవధిక సమ్మెకు తూంకుంట మద్ధతు




సిద్దిపేట, ఆగస్టు 25, మనం న్యూస్ ప్రతినిధిః తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ గత పది రోజుల నుండి సమ్మె చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంల నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి హాజరై మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఉద్యోగులను మోసగిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, కాంగ్రెస్ హయాంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బిఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్తారన్నారు. ఎంతో శ్రమకోర్చి రెండో ఏఎన్‌ఎంలు సేవ చేస్తుంటే వారి కష్టం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తమ న్యాయమైన డిమాండ్‌లను కోరడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దరిపల్లి చంద్రం, డా. సూర్యవర్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ కోసం గూడూరి శ్రీనివాస్ దరఖాస్తు



సిద్దిపేట, ఆగస్టు 25, మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ కోసం పిసిసి చేనేత విభాగం చైర్మన్ గూడూరి శ్రీనివాస్ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. గాంధీ భవన్ లో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌కు తన దరఖాస్తును అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్‌గా, సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గత 20 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతున్న గూడూరి శ్రీనివాస్ తనకే టికెట్ దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

### మున్సిపల్ వైస్ ఛైర్మన్ జంగిటి కనకరాజు ముదిరాజ్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25, మనం న్యూస్ః ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ వైస్ ఛైర్మన్ జంగిటి కనకరాజు ముదిరాజ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, హైదరాబాద్ మాజీ మేయర్, పాత్రికేయుడు, విద్యావేత్త అయిన ముదిరాజ్ సంఘం స్థాపకుడు కొరిమి కృష్ణస్వామి 130వ జయంతిని శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు సంఘం, ముదిరాజ్ మహాసభ, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ సంఘం నాయకులు మాట్లాడుతూ కొరిమి కృష్ణస్వామి రాజకీయంగా ముదిరాజ్‌లు ఎదగాలని ఆర్థికంగా వెనుకడిన ముదిరాజ్‌లకు సంఘం ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందించారన్నారు. ముదిరాజ్ మహానాయకుల జయంతిలను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ , గౌరవ అధ్యక్షులు పరమేశ్వర్, గౌరవ సలహాదారు యాదగిరి, మీడియా సెల్ ఇంచార్జ్ బైరి సతీష్, ముదిరాజ్ నియోజకవర్గ జర్నలిస్టుల సంఘం గౌరవ అధ్యక్షులు వెంకన్న, ఉపాధ్యక్షులు వెంకట్, బాలేష్, తిరుపతి, పిట్ల శ్రీనివాస్, కుల సంఘ నాయకులు ధర్మ



ముదిరాజ్, తుపాకుల బాల్‌రంగం, మిద్దె రవి, జంగిటి శ్రీనివాస్, పిట్ల రాజయ్య, రాజన్న, నర్సింలు, బైరి యాదగిరి, లక్ష్మణ్ శ్రవణ్, రాజు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో ఐఓసి భవనం

- ప్రజల సౌకర్యార్థం కోసమే
- సెప్టెంబర్ 6 న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభం
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్



హుస్నాబాద్,ఆగస్టు 25,(మనం న్యూస్): హుస్నాబాద్ సమీకృత కార్యాలయాన్ని కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తున్నామని, సెప్టెంబర్ 6 న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఈ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. హుస్నాబాద్‌లో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.17 కోట్ల వ్యయంతో అత్యంత అధునాతన పద్ధతిలో నిర్మాణం జరుగుతున్న సమీకృత కార్యాలయాన్ని హుస్నాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి బెన్‌షాలోమ్‌తో కలిసి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రూమ్ తిరుగుతూ ప్రతి డిపార్ట్‌మెంట్ వారు నెమ్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండాలన్న ధృడ సంకల్పంతో చేపట్టిన సమీకృత కార్యాలయాల సముదాయం (ఐఓసి) నిర్మించడం జరుగుతుందన్నారు. ఇక్కడికి వచ్చే ప్రజలకు ఒకే చోట అన్ని కార్యాలయాలతో సులభతరమైన సౌకర్యం అందించవచ్చు. హుస్నాబాద్ సమీకృత కార్యాలయ పనులు పూర్తి దశలో ఉన్నాయన్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో ఉన్న రెవెన్యూ డివిజన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఇంజనీరింగ్ అండ్ ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ఫారెస్టు డిపార్ట్‌మెంట్, ఎస్‌టివో ట్రెజరీ ఆఫీసు, తదితర ప్రభుత్వ కార్యాలయాలను ఇక్కడికి షిఫ్ట్ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఐఓసిలో ఏర్పాటు చేసిన కార్యాలయాలు సిబ్బందితో సహ ఫైల్స్ ఇతర సామాగ్రి త్వరగా ఐఓసికి షిఫ్ట్ చేసి ఐఓసి ప్రారంభంచి ప్రజలకు సేవలు అందించేందుకు అన్ని విధాల సిద్ధం కావాలన్నారు. ఫర్నిచర్ మాత్రం ప్రతి కార్యాలయానికి అందిస్తామన్నారు. కార్యాలయంకు కావాల్సిన ఎలక్ట్రిసిటీ, త్రాగునీటి సౌకర్యం, మంచి రోడ్డు సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. జనగాం రోడ్డు నుండి ఆఫీసు కాంప్లెక్స్ వరకు బట్టర్ ఫ్లై లైట్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పక్కనే ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు కూడా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐఓసి, పాలిటెక్నిక్ కళాశాలతో మంచి ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికి 11 డిపార్ట్‌మెంట్లు గ్రౌండ్ ఫ్లోర్‌లో సేవలందించడం జరుగుతుందన్నారు. మిగతా ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణ దశలో ఉన్న అడ్మిషన్స్ సాంక్షన్ అన్ని పూర్తి చేసుకుని అతి త్వరలో అది కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతాం అన్నారు. మోడల్ సౌకర్యాలతోటి అధునాతన పద్ధతిలో జనాలకు సేవలు అందించేందుకు కార్యాలయం సిద్ధంగా ఉంటుందన్నారు. సెప్టెంబర్ 6 న ఐవోసి భవనాన్ని ప్రారంభించేందుకు మంత్రి హరీశ్‌రావు సమయం ఇచ్చారన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ల చేతుల మీదుగా ఐఓసి భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. కలెక్టర్ వెంట డిటివో బాలరాజు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, ఎజెన్సీ కాంట్రాక్టర్ తదితరులున్నారు.



# హుస్నాబాద్ గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగరాలి

- కాంగ్రెస్ అభ్యర్థిగా వస్తున్నా..ఆశీర్వదించండి
- నాడు తెలంగాణ కోసం కష్టపడ్డాను...

నేడు హుస్నాబాద్ అభివృద్ధికి కష్టపడుతా

- కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గౌడ్



హుస్నాబాద్,ఆగస్టు 25,(మనం న్యూస్): హుస్నాబాద్ గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. హుస్నాబాద్‌లో శుక్రవారం స్థానిక సిద్ధేశ్వర ఆలయం, సంతోషిమాత ఆలయం, పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసారు. ఆనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలనే ఆలోచనతో పార్టీ నాయకత్వం, కార్యకర్తల అభీష్టం మేరకు కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు చేస్తున్నాను అని ఆయన తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ గొంతు, అభివృద్ధి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన కర్తవ్యంగా పని చేసేటువంటి ఆలోచనతో ప్రజల ఆశీస్సులు కోరుతున్నాను అన్నారు. స్థానిక సిద్ధేశ్వర ఆలయం, సంతోషిమాత ఆలయం, రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం, కొత్తకొండ వీరభద్రుడు, పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వాముల ఆశీర్వచనం తీసుకోవడం జరిగిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం వెనకబడ్డది, నిర్లక్ష్యానికి గురైందన్నారు. స్థానిక శాసనసభ్యుడి పనితీరు సమర్థవంతంగా లేకపోవడం వల్ల అభివృద్ధి జరగలేదని ఆయన ఆరోపించారు. ప్రజలందరూ తెలంగాణ పోరాట యోధుడిగా తెలంగాణ కోసం ఏ విధంగానైతే కష్టపడ్డానో హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం కష్టపడుతాడనే విశ్వాసంతో అవకాశం ఇవ్వాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఒక్కసారి నన్ను గెలిపివ్వమని ఆయన ప్రజలను కోరారు. ఎటువంటి హామీ లేకుండా తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన మాజీ శాసనసభ్యుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి రాజకీయ సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తామన్నారు. అందరి నాయకుల సహకారంతో, పాటు మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డిని కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నాను హుస్నాబాద్ గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేడం లింగమూర్తి, చిత్తారి రవీందర్, పున్న సది, వడ్డేపల్లి వెంకటరమణ, అయిత శ్రీధర్, వెన్న రాజు, భీక్యనాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.



## రాజకీయ పబ్బం గడుపుకోవడానికే

# పొన్నం విమర్శలు

- ఎంపీగా ఉన్నపుడు నిధులెన్ని తెచ్చావు
- అన్ని రంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధి
- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్



హుస్నాబాద్,ఆగస్టు 25,(మనం న్యూస్): రాజకీయ పబ్బం గడపుకోవడానికి కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ నోటికి ఏదీ వస్తే అది మాట్లాడితే ప్రజలు విశ్వసించే రోజులు పోయాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ విమర్శించారు. శుక్రవారం ఎమ్మెల్యే సతీశ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ గతంలో కల్లబొల్లి కబుర్లు చెప్పి కాంగ్రెస్ నాయకులు తమ పబ్బం గడుపుకున్నారే తప్ప హుస్నాబాద్‌ను అభివృద్ధి మాత్రం చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కేసీఆర్ సీఎం అవ్వడంతో హుస్నాబాద్ నియోజకవర్గానికి చాలా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసాను అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలబెడుతున్నానని ఆయన తెలిపారు. ఇవి చూసి ఓర్వలేని తనంతో ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్నపుడు హుస్నాబాద్ నియోజక వర్గానికి ఎన్ని నిధులు తెచ్చావంటూ ఆయన ప్రశ్నించారు. హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి ఏంటో తెలుసా అంటూ ఆయన పొన్నంకు సవాలు విసిరారు. తెలంగాణ కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన వ్యక్తిగా వ్యక్తిగతంగా పొన్నం ప్రభాకర్ అంటే గౌరవం ఉందని ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడి అతని వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోవద్దని హితవు పలికారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు

- ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు
- హుస్నాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎర్రల కిరణ్



హుస్నాబాద్,ఆగస్టు 25,(మనం న్యూస్): నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని హుస్నాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎర్రల కిరణ్ తెలిపారు. శుక్రవారం హన్మకొండ-సిద్దిపేట ప్రధాన రహదారి పై పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న ఆటోను బంజారుపల్లి స్టేజీ వద్ద ఆటోను ఆయన ఆపి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సి.ఐ.కిరణ్ మాట్లాడుతూ కుటుంబంలో ఒక వ్యక్తి చనిపోయిన కుటుంబమంతా రోడ్డున పడుతాదన్నారు. ఒక్క ఆటోలో 14 మంది ప్రయాణికులను ఎక్కించుకోవడం పట్ల ఆయన ఆటో డ్రైవర్ పై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. నిర్లక్ష్యం కారణంగా డ్రైవర్ల ప్రాణాలతో పాటు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. విశ్రాంతి లేకుండా డ్రైవింగ్ చేయడం కూడా శ్రేయస్కరం కాదన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారి పై చట్టపరమైన చర్యలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

## వెంకటేశ్వరాలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



నంగునూరు, ఆగస్టు 25, మనం న్యూస్ః శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని మండలంలోని పాలమాకుల వెంకటేశ్వ రాలయంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే మహిళలు ఆలయానికి చేరుకొని వ్రతాలు నిర్వహించారు. ఈ వరలక్ష్మీ వ్రతాలు చేయడం ద్వారా కుటుంబానికి దేవత ఆశీస్సులు ఎల్లకాలం ఉంటాయని మహిళల నమ్మకం. అనంతరం ఇరుగుపొరుగు మహిళలకు వాయినాలు అందించారు.

## ఆలయాల ఖిల్లా సిద్దిపేట




చిన్నకోడూరు, ఆగస్టు 25, మనం న్యూస్ః విద్య, వైద్యం, అభివృద్ధితోపాటు అన్ని రంగాల్లో ముందున్న సిద్దిపేట నేడు ఆలయాల ఖిల్లాగా మారిందని భారాస పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి కొరకు విడుదల చేసిన నిధుల్లో భాగంగా మండల పరిధి సలేంద్రి రామలింగేశ్వరాలయానికి రూ. 50 లక్షలు మంజూరు చేసిన మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర బిందువైన సిద్దిపేటలో ఆలయాలు కొత్త శోభను సంతరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుల సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికే దిక్సూచిలా మారిందని, ఆలయాల నిర్మాణాలు, జీర్ణోద్ధరణతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందని కోరుతున్నానన్నారు. రామలింగేశ్వరాలయానికి కోరిన వెంటనే గతంలో మంత్రి హరీష్‌రావు సిసి రోడ్ల మంజూరు, బ్రిడ్జి ఇతరత్రా సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు.

**-నిధుల విడుదల పట్ల కృతజ్ఞతలు**

సలేంద్రి రామలింగేశ్వరాలయానికి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేసిన మంత్రి హరీష్‌రావుకు ఆలయ నిర్వాహకులు పానుగంటి నర్సింహాచారి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులను అందించడం రాష్ట్ర అభివృద్ధికి శుభ సూచకమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్‌రావులపై రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఈ ప్రాంత ప్రజల తరుపున కోరుతున్నామన్నారు.

## నూతన తహసీల్దార్‌గా జోగినిపల్లి రాజేశ్వర్‌రావు



చేర్యాల, ఆగస్టు 25, మనం న్యూస్ః చేర్యాల మండల తహసీల్దార్‌గా జోగినిపల్లి రాజేశ్వర్‌రావు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఏవైనా రెవెన్యూ సమస్యలుంటే నేరుగా సంప్రదిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

# కేసీఆర్‌ది మిత్రద్రోహం

**మునుగోడులో గెలిచింది మా వల్లనే**

**బీఆర్ఎస్‌ను ఓడించే లక్ష్యంతో పని చేస్తాం**

**సిపిఐ, సిపిఎం కలిసి పోటీ చేస్తాం**

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**

హుస్నాబాద్,ఆగస్టు 25,(మనం న్యూస్)ః సీఎం కేసీఆర్ మిత్రద్రోహానికి పాల్పడ్డారని, బీఆర్ఎస్‌ను ఓడించే లక్ష్యంతోనే పని చేస్తామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. సిపిఐ 5 స్థానాలు, సిపిఎం 4 స్థానాలు కావాలని కేసీఆర్‌ను అడిగితే రెండు ఎమ్మెల్యేలు ఒక ఎమ్మెల్సీ ఇస్తామనడంతో బీఆర్ఎస్‌కు బై బై చెప్పామన్నారు. బీజేపీతో బీఆర్ఎస్‌కు ఎక్కడో మిత్రుత్వం ఏర్పడిందని ఆయన ఆరోపించారు. రాజకీయం అంటేనే మోసం అనే నిర్వచనాన్ని కేసీఆర్ ఇస్తున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ అవకాశవాద రాజకీయ నాయకుడని మండిపడ్డారు. లెఫ్ట్ పార్టీల మద్దతు లేకపోతే మునుగోడులో బీఆర్ఎస్ గెలిచేదా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో సిపిఐ, సిపిఎం కలిసే పోటీ చేస్తాయని ఆయన స్పష్టం చేసారు. తాము ఎవరితో కలవాలనేది భవిష్యత్తులో నిర్ణయిస్తామన్నారు. తమతో కలిసి వచ్చేవారితో పని చేస్తామని ఆయన వెల్లడించారు. మేం అడిగిన సీట్లలో కూడా అభ్యర్థులను ప్రకటించి కేసీఆర్ మోసం చేసారన్నారు. సెప్టెంబర్ 17 ను



తెలంగాణ సర్కార్ అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేసారు. కొన్ని చోట్ల అమరుల స్థూపాలు కూలిపోతున్నాయని వాటిని మళ్లీ కట్టిస్తామని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటంతోనే నిరుపేదలకు ఇండ్ల స్థలాలు వచ్చాయని ఆయన గుర్తు చేసారు. బలమున్న స్థానాల్లో తప్పకుండా పోటీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. కమ్యూనిస్టుల సత్తా ఎంటో బీఆర్ఎస్‌కు చూపిస్తామన్నారు. ఈసమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కలపల్లి శ్రీనివాస్‌రావు, ఆయా జిల్లాల కార్యదర్శులు మంద పవన్, మర్రి వెంకటస్వామి, కర్రె భిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశ్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# మట్టి రోడ్డుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



**సిపిఐ మండల కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి డిమాండ్**

చేర్యాల, ఆగస్టు 25, మనం న్యూస్ః చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయిన రోడ్డుకు వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఐ మండల కమిటీ సభ్యులు కత్తుల భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపల్లి గ్రామం మీదుగా పడమటి కేశవాపూర్, లింగంపల్లి, నాగిరెడ్డిపల్లి, చుంచనకోట, జయల తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే వెళ్లాలని, ఈ రోడ్డు తెగిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సాధమైన చంద్రయ్య, పోరెడ్డి నరసయ్య, గర్నపల్లి కనకయ్య, సాదమైన రమేష్, పోరెడ్డి వెంకటేశం, గర్నపల్లి బాలమల్లు, జింకల బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ అవకాశ వాది

**సిపియం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**

కొమురవెల్లి, ఆగస్టు 25, మనం న్యూస్ః సీఎం కేసీఆర్ పచ్చి అవకాశ వాది అని సిపియం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం కొమురవెల్లి సిపియం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వచ్చే అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని ఓడించితీరుతామన్నారు. సీఎం కేసీఆర్ అవసరానికో అబద్ధం ఆడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నాడని, రాష్ట్ర ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో వామపక్షాల మద్దతుతో బీజేపిపై కుస్తీ పట్టి గెలిచి, ఇప్పుడు గెలవడానికి బీజేపితో దోస్తీ చేస్తున్నాడని ఆరోపించారు. తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో పేదల బతుకులేం మారలేదని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. తెలంగాణ ప్రజ సంపదను అధికంగా దోచుకున్నది కేసీఆర్ ప్రభుత్వం అని, వారి ఎమ్మెల్యేలే అని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని ఓడించితీరుతామన్నారు. ఈ కార్యక్రమలో సిపియం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి, నాయకులు రాళ్లబండి నాగరాజు, సార్ల యాదయ్య, ఆరుట్ల దయానంద్, చెరుకు వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## బిటి రోడ్డు పనులు ప్రారంభించాలి

### ఆదేశాలు జారీ చేసిన ఎంపి ప్రభాకర్‌రెడ్డి



దౌల్తాబాద్, ఆగస్టు 25, మనం న్యూస్ః దౌల్తాబాద్‌లోని మొండి చింత నుండి మహమ్మద్ షాపూర్ ఇందుప్రియాల్, మాచిన్‌పల్లి మీదుగా నాచారం గుట్ట వరకు ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో ఎనిమిది గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి ఎంపిపి గంగాధర్ సంధ్య రవిందర్, తెరాస మండల పార్టీ అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపి ప్రభాకర్‌రెడ్డి వెంటనే స్పందించి ఆర్ అండ్ బి రోడ్డు రెన్యువల్ చేయాలని ఎస్‌ఈకి ఫోన్‌లో సమాచారం అందించి వెంటనే పనులు ప్రారంభించాలని తెలిపారు. ఈ మేరకు బిటి రోడ్డును ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినందుకు వారు ఎంపి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు స్టీవెన్‌రెడ్డి, సర్పంచ్ల గౌరవ అధ్యక్షులు దార సత్యనారాయణ, నాయకులు కుమార్, పూర్ణయ్య, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు ప్రత్యేక ప్రక్రియ

### తహసీల్దార్ గోవర్ధన్



మిరుదొడ్డి, ఆగస్టు 25, మనం న్యూస్ః మండల వ్యాప్తంగా ఓటు హక్కు లేని వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈనెల 26, 27 తేదీలలో రెండు రోజు పాటు ప్రత్యేక ప్రక్రియ చేపట్టనున్నట్లు తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు. గ్రామస్తులంతా ఓటరు లిస్టులో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకొని, ఏవైనా తప్పులుంటే తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా 18 ఏండ్లు నిండిన వారంతా నూతనంగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

# పురాతన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

### మంత్రి హరీష్‌రావు





సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25, మనం న్యూస్ః సిద్దిపేట నియోజకవర్గంలోని పురా తన ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు అయినట్లు మంత్రి హరీష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ ధార్మిక దార్శనికుడని, రాష్ట్రంలో అనేక దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 50కి పైగా దేవాలయాలు అభివృద్ధి చేసుకున్నామని, అదే తరహాలో నియోజకవర్గంలో కొత్తగా మరో ఆరు దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసుకున్నామన్నారు. చిన్నకోడూరు మండలం సలేంద్రిలోని శ్రీ రామలింగేశ్వరాలయానికి రూ. 50 లక్షలు, విఠలాపూర్‌లోని గుట్టపై వెలిసిన శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయానికి రూ. 42 లక్షలు, నారాయణరావుపేట మండలంలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయానికి రూ. 39 లక్షలు, సిద్దిపేట పట్టణంలోని శ్రీ పెద్దమ్మ దేవాలయానికి రూ. 30 లక్షలు, హనుమంతుపల్లి, ఇర్కోడ్‌లోని పెద్దమ్మ దేవాలయాల మిగులు పనులకు రూ.20 లక్షలు, అర్బన్ మండలం మిట్టపల్లిలోని శ్రీ మహంకాళి దేవాలయానికి రూ. 17.50 లక్షల చొప్పున మంజూరయ్యాయని తెలిపారు. వీటికి త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.



## ఘనంగా వరలక్ష్మి వ్రతాలు

దౌల్తాబాద్, ఆగస్టు 25, మనం న్యూస్ః శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్క రించుకొని దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా ఆలయాల్లో పెద్ద ఎత్తున మహిళలు ప్రత్యేక పూజలతోపాటు వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామంలో వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని జెడ్పిటిసి రణం జ్యోతి, ఎంపిపి గంగాధరి సంధ్యకు పసుపుబొట్టును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఉదయాన్నే వ్రతాలు నిర్వహించడం ద్వారా అమ్మవారి కటాక్షం కలుగుతుందన్నారు. వరలక్ష్మి వ్రతాలు నిర్వహించి చుట్టుపక్కల మహిళలకు పసుపు బొట్టును అందజేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వరలక్ష్మి వ్రతం ద్వారా అమ్మవారి దీవెనలు ఎల్లకాలం ఉంటాయన్నారు.


# అశ్వారావుపేట ఆయిల్‌పామ్ సాగు ఆదర్శం

**-ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన మండల రైతులు, ప్రజాప్రతినిధులు**

**-త్వరలో నర్మెట ఆయిల్‌ఫామ్ కర్మాగారం పనులు ప్రారంభం**

నంగునూరు, ఆగస్టు 25, మనం న్యూస్ః ఖమ్మం జిల్లా అశ్వారావుపేట ఆయిల్ ఫామ్ తోటలు, అప్పారావుపేట ఫ్యాక్టరీ చాలా మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్ ఫామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డిలు అన్నారు. శుక్రవారం





నంగునూరు మండలంలోని ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి అప్పారావుపేట, అశ్వారావుపేటలోని ఆయిల్‌ఫామ్ తోటలను కర్మాగారాన్ని సందర్శించి సాగు వివరాలను, ఆయిల్ ప్రాసెసింగ్ విధానం ఆయిల్ ఫెడ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక కృషి మేరకు నంగునూరు మండలం నర్మెటలో రూ. 247 కోట్లతో 65 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ కర్మాగారం అత్యాధునిక విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంటుందన్నారు. జిల్లా సాగు విస్తరించేందుకు ఇక్కడి తోటలను, పరిశ్రమను పరిశీలంచడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుతో లాభదాయక పంటలైన ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఆర్థికంగా ఎదగనున్నారని తెలిపారు. రైతు ఒక్కసారి ఆయిల్‌ఫామ్ సాగు చేస్తే 30 ఏళ్ల వరకు ఆదాయాన్ని ఇస్తుందని తెలిపారు. రైతు ఆదాయం పెరగడంతో పాటు ఆయిల్



ప్రాసెసింగ్, ప్యాకేజ్, మార్కెటింగ్‌తో కలిపి ప్రత్యక్షంగా, పరోక్షంగా 400 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. మంత్రి హరీష్‌రావు కృషి ఫలితంగా భవిష్యత్తులో సిద్దిపేట జిల్లా కోనసీమగా మారే అవకాశం ఉందన్నారు. రైతుల సహకారంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 9 వేల ఎకరాల సాగు పూర్తి చేసుకున్నామన్నారు. వచ్చే ఏడాది 17, 800 ఎకరాల్లో సాగును పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల కన్వీనర్ బద్దిపడగ కృష్ణారెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ కోల రమేష్ గౌడ్, మాజీ ఏఎంసి ఛైర్మన్ రాగుల సారయ్య, రైతులు రంగు రాజు గౌడ్, వెంకట్‌రెడ్డి, సనాదుల బాలపోచయ్య, మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నియంత పాలనకు చరమగీతం పాడాలి



**-ప్రభుత్వ ఆస్తులను అమ్మి**

**ప్రభుత్వాన్ని నడుపుతున్న ఘనత కేసీఆర్‌ది**

**-బీజేపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి**

సిద్దిపేట రూరల్, ఆగస్టు 25, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథాన ముందుకు లేదని, కానీ నేతలు మాత్రం ప్రజలను మభ్యపెడుతున్నారని బీజేపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపి రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు జిల్లా బీజేపి ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా బీజేపి నేతలకు, పోలీసులకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపి నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈస ందర్భంగా దూది శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం దౌర్భాగ్య స్థితిలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఉంచిన హామీలను నెరవేర్చమని నిరసనకు దిగితే అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఏ ఆశయంతో అయితే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామో దానిని ఇసుమంత కూడా సాధించలేదన్నారు. ప్రాజెక్టుల పేరున నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మభ్య పెట్టడానికి కొత్తకొత్త పథకాలు తీసుకువస్తున్నారన్నా రు. మద్యం షాపులకు మరో మూడు మాసాల గడువు ఉన్నప్పటికీ ఇప్పుడే టెండర్లు పిలిచి రెండు వేల కోట్లకు పైగా ధనాన్ని ఆర్జించారన్నారు. ప్రభుత్వ భూములను అమ్ముకొని ప్రభుత్వాన్ని నడుపుతున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీజేపి విశ్రమించదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చకపోతే బీజేపి పార్టీ తరుపున పెద్ద ఎత్తున రాస్తారోకోలు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు గంగాడి మోహన్‌రెడ్డి, వంగ రాంచంద్రారెడ్డి, విద్యాసాగర్, పత్రి శ్రీనివాస్ యాదవ్, గురువారెడ్డి, బూరుగు సురేష్ గౌడ్, కోడూరు నరేష్, విభీషణ్‌రెడ్డి, మండల అధ్యక్షులు కుమార స్వామి, పరశురాములు, మహిళా మోర్చ నాయకురాలు అరుణారెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు కుటుంబానికి డిడబ్ల్యూజేఎస్ అధ్యక్షులు పరామర్శ



దౌల్తాబాద్, ఆగస్టు 25, మనం న్యూస్ః ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాన్ని డిడబ్ల్యూజేఎస్ జిల్లా అధ్యక్షులు జంగం రాజలింగం పరామర్శించారు. శుక్రవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు గొల్లపల్లి నగేష్ తండ్రి గొల్లపల్లి లింగయ్య గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా డిడబ్ల్యూజేఎస్ అధ్యక్షులు జంగం రాజలింగం శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎర్ర నర్సింలు, బాల్‌రాజు, నర్సింలు, శంభులింగం, మహేష్, గట్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

**తహసీల్దార్ లక్ష్మణ్ బాబు**

పాపన్నపేట, ఆగస్టు 25, మనం న్యూస్ః 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని పాపన్నపేట మండల తహసీల్దార్ లక్ష్మణ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈనెల 26, 27 తేదీల్లో, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టనున్నా మన్నారు. 18 సంవత్సరాలు నండిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాపన్నపేట మండల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ వద్ద సంబంధిత బూత్ స్థాయి అధికారి అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరు తమ పేరు ఓటరు జాబితాలో చూసుకొని లేని యెడల నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

**-దుబ్బాక నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి గరిమా అగ్రవాల్**

దుబ్బాక టౌన్, ఆగస్టు 25, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పరిధిలో 26, 27 తేదీలతోపాటు సెప్టెంబర్ 2, 3 తేదీలలో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, దుబ్బాక నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి గరిమా అగ్రవాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండిన వారంతా ఓటరుగా విధిగా నమోదు చేసుకొని వచ్చే ఎన్నికల లోపు ఓటరు గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో ప్రదర్శించే ఓటరు లిస్టులో ఏవైనా తప్పులుంటే సరి చూసుకోవాలని, ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు యువతీ యువకులు ప్రోత్సహించాలని సూచించారు. ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటిదన్నారు. కావున 18 ఏండ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఏవైనా తప్పులు ఏర్పడితే స్థానిక బిఎల్‌ఓలను సంప్రదించాలని సూచించారు.

## సెప్టెంబర్ 15 లోపు పంట రుణాల లక్ష్యాన్ని సాధించాలి

**67, 188 మంది రైతులకు జిల్లాలో రుణమాఫీ: జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**



సంగారెడ్డి, ఆగస్టు 25, మనం న్యూస్ః సెప్టెంబర్ 15 లోపు ఖరీఫ్ పంట ద్వారా లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ శరత్ బ్యాంకర్లను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక మద్దతు పథకం కింద ఎస్సీ ఎస్టీలకు మంజూరైన పెండింగ్ యూనిట్లను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. బ్యాంకర్లు రుణ లక్ష్యాలను చేరుకోవాలని, ఆర్థిక మద్దతు పథకాల కింద ఎస్సీ ఎస్టీలకు మంజూరైన పెండింగ్ యనిట్లను ఈనెలాఖరులో గ్రౌండింగ్ చేయాలన్నారు. నెలాఖరుకు 50 శాతం సాధించాలని సూచించారు. బ్యాంకర్లు, జిల్లా అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు సంబంధించి మొత్తం రూ. 2494.97 కోట్లు ప్రాధాన్యతర రంగాలకు సంబంధించి రూ. 1023.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రుణమాఫీలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 67, 188 మంది రైతుల ఖాతాల్లో 340.47 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, నాబార్డ్ ఏజిఎం కృష్ణతేజ, జెడ్పి సిఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, ఏఓ జేడి నరసింహారావు, పరిశ్రమల శాఖ మేనేజర్ ప్రశాంత్, మెప్మా పిడి గీత, ఎస్సీ ఎస్టీ బిసి, మైనార్టీ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న జేడి లక్ష్మీ నారాయణ**



రామచంద్రాపురం, ఆగస్టు 25, మనం న్యూస్ః ఈనెల 26వ తేదీన రామచంద్రాపురంలోని డి మార్ట్ పక్కన ఉన్న శ్రీ బాలాజీ గార్డెన్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ యువత కోసం 50 కంపెనీలతో మెగా జాబ్ మేళాను ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పదవ తరగతి నుండి పిజి వరకు అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, కంపెనీలు పోస్టుల వారీగా రూ. 10 వేల నుండి రూ. 50 వేల వరకు జీతం అందించనున్నాయని ప్రతినిధులు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో టెక్ మహీంద్ర, జాన్సన్ లిఫ్ట్స్, యాక్సిస్ బ్యాంక్, ఐడిఎఫ్‌సి బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలు పాల్గొంటున్నాయని, ఆసక్తి గల యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98666 90794, 73373 73575 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు హర్షనీయం



సిద్దిపేట రూరల్, ఆగస్టు 25, మనం న్యూస్ః సిద్దిపేట నియోజ కవర్గంలోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం హర్షనీయమని, నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాలకుంట్ల కృష్ణమాచార్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఆరు పురాతన ఆలయాల అభివృద్ధికి రూ. 1.98 కోట్ల నిధులను మంజూరు చేయడం సంతోషకరమ న్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలో ఆలయాలకు పూర్వ వైభవం తీసుకువస్తున్నారని, దూప దీప నైవేద్యాలతో, భక్తుల రాకతో ఆలయాలన్నీ సందడిగా మారుతున్నాయన్నారు.

## స్పాట్ అడ్మిషన్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి, ఆగస్టు 25, మనం న్యూస్ః మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల చెప్యాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో బైపిసి, ఎంపిసి విభాగాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి విభాగంలో 6, బైపిసిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆసక్తి కలిగి ఉన్న వారు ఈనెల 28వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# వరాలనొసగే వరలక్ష్మీ వ్రతం

## భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు







సిద్దిపేట రూరల్, ఆగస్టు 25, మనం న్యూస్ః శ్రావణ మాసంలో ఆడపడుచు లకు వరాలనొసగే వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిం చారు. ప్రతి ఇంట్లో అమ్మవారి ప్రతిమను ఏర్పా టు చేసుకొని వరలక్ష్మీ దేవి పూజ ను కన్నుల పండువగా నిర్వహిం చారు. అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అత్యం త పవిత్రమైన శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారా న్ని శ్రావణ శుక్రవారంగా జరుపుకుంటారు. ఈ రోజున ఆడపడుచులందరూ నియమనిష్టలతో తాము కోరుకున్న కోరికలు పొందడానికి వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు. సిద్దిపేటలోని సంతోషిమాత దేవా లయంలో వరలక్ష్మీవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ అర్చకులు పొడిచేటి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ మాంకాల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా హాజరైన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు. సంతోషిమాత భజన మండలి, హనుమాన్ భజన మండలి, శబరిగిరీష సేవా సమితి ప్రజా మండలి వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. 31వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మీ వారం సందర్భంగా సంతోషిమాత అమ్మవారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

**-బిఆర్ఎస్‌తో నెరవేరని స్వరాష్ట్ర కాంక్షలు**

**-సిద్దిపేట కాంగ్రెస్ టికెట్‌కై మార్క సతీష్ గౌడ్ దరఖాస్తు**



సిద్దిపేట రూరల్, ఆగస్టు 25, మనం న్యూస్ః రాష్ట్రంలో అధికార పార్టీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తాయని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ కోసం దరఖాస్తు అందజేసిన మార్క సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సిద్దిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండ వర్గాల ప్రజలకు లబ్ధి చేకూ రిందన్నారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, అను కున్న ఆశయాలు ఈ ప్రభుత్వం ద్వారా నెరవేరడం లేదన్నారు. కాం గ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామ న్నారు. ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్, ఉపాధ్యక్షులు సందబోయిన పరశురామ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ బైరి సాయికుమార్, యూత్ కాంగ్రెస్ చిన్నకోడూరు మండల అధ్యక్షులు జయంత్, అసెంబ్లీ సెక్రటరీ కల్లూరి నర్సయ్య, ఎన్ఎస్‌యుఐ చిన్నకోడూరు మండల అధ్యక్షులుఉ ప్రశాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐకి మున్నూరుకాపు సంఘం నాయకుల శుభాకాంక్షలు



కోహెడ, ఆగస్టు 25, మనం న్యూస్ః కోహెడ నూతన ఎస్ఐగా బా ధ్యతలు చేపట్టిన సి.హెచ్. తిరుపతికి మున్నూరుకాపు సంఘం నా యకులు శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం రోజున మండల పరిధిలోని కూరెళ్ల గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించి శాంతిభద్రతలను పరిరక్షించి ప్రజల మన్న నలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు చిన్న సంఘం అధ్యక్షులు గాజుల రవిందర్, తోట శ్రీనివాస్, కొనవేని రవిందర్, ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు పంగ మల్లికార్జున్, లావుడ్యా ధర్మయ్య, గూళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ డివిజన్‌గా పటాన్‌చెరు

**ఆర్డీఓ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు జిఓ జారీ**

**బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



పటాన్‌చెరు, ఆగస్టు 25, మనం న్యూస్ః సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పటాన్‌చెరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడమే కాకుండా పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రోజున ఆయన జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ డివిజన్ సేవలు అత్యంత అవసరమని, ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన భారీ బహి రంగ సభలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాల లేకపోవడం మూలంగా యువత ఉద్యోగ ఉపాధి అవకాశా లు దొరకక ఇబ్బందులు పడుతున్నారని తెలపడం జరిగిందన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్ వాటిని అమలు చేస్తూ జీవో జారీ చే యడం పట్ల ఆనందంగా ఉందన్నారు. సంగారెడ్డి రెవెన్యూ డివిజన్‌లోని పటా న్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, గుమ్మడిదల, జిన్నారం మండలాలతో కూడిన పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కాబోతుందన్నారు. నూతన పాలిటెక్నిక్ కళాశాలకు సైతం అతి త్వరలో స్థలం కేటాయించి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు వచ్చిన అడ్డంకులు తొలగి తిరిగి ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మియాపూర్ నుండి ఇస్నాపూర్ వరకు నిర్మించతలపెట్టిన మెట్రో రైల్ పనులు ప్రాథమిక ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఉస్మాన్ నగర్‌లో ఐటి టవర్ ఏర్పాటుకు సంబంధిత శాఖ సన్నాహాలు ప్రారంభించిందని తెలిపారు. గత తొమ్మిదేళ్ల కాలంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలపడంలో సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాబోయే ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపికై మూడు నెలలు...ఇండ్లు ఇచ్చేదెప్పుడు

**- మున్సిపల్ కమీషనర్‌ను నిలదీసిన బాధితులు**

**- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా**



హుస్నాబాద్,ఆగస్టు 25,(మనం న్యూస్)ః నిలువ నీడలేని నిరుపేద కుటుం బాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకం అపహాస్యం పాలవుతోంది. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి మూడు నెలలు అవుతన్నా ఇంత వరకు కూడా ఇండ్లు ఇవ్వకపోవడంతో బాధితులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మున్సిపల్ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయంలో మీటింగ్ ఉందంటూ బయటకు వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను లబ్ధిదారులు, ప్రతిపక్ష నాయకులు అడ్డుకొని నిలదీసారు. లక్కీ డ్రాలో పేర్లు వచ్చిన నిరుపేదలు కొందరు పూరిపాకల్లో నివసిస్తుండగా, మరికొందరు అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. అద్దె ఇండ్లలో నివసిస్తున్న నిరుపేదలకు అద్దె డబ్బులు కట్టలేక యజమానులు ఖాళీ చేయమంటున్నా రంటూ ఆవేదన వ్యక్తం చేసారు. డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చాయని అందరూ అంటున్నారే తప్ప మాకు ఇంత వరకు కూడా మాకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మంచి రోజుల్లో కేటాయిస్తానని చెప్పి నెలలు గడుస్తుందన్నారు. వెంటనే మాకు డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరీ చేయాలని వారు డిమాండ్ చేసారు. ఆనంతరం ప్రతిపక్ష నాయకులు అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ లక్కీడ్రాలో దక్కిన అర్హులకు ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూమ్‌లు అందజేయాలని వారు డిమాండ్ చేసారు. లేని యెడల అందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రావు



పటాన్‌చెరు, ఆగస్టు 25, మనం న్యూస్ః ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పటాన్‌చెరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పారితోషికం రూపంలో 9750 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. గత 18 ఏండ్లుగా పని చేస్తున్నా వారి జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. వెంటనే వీరిని రెగ్యులరైజ్ చేసి వీరికి కనీస వేతనం రూ. 18 వేలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గీత, హైమావతి, లక్ష్మి, లావణ్య, ఆశాలు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న డా. ఆయేషా తన్వీర్



సంగారెడ్డి, ఆగస్టు 25, మనం న్యూస్ః సంగారెడ్డి పట్టణంలోని చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం డా. ఆయేషా తన్వీర్ సుమారు 30 మంది మహిళలతో కలిసి బిఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి చింతా ప్రభాకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం డా. ఆయేషా తన్వీర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం చింతా ప్రభాకర్ మాట్డాతూ మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ సిడిసి ఛైర్మన్ విజేందర్‌రెడ్డి, నాగరాజు గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్, శేఖర్, అజ్జు, గోవింద్ పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

### కేసు నమోదు చేసుకున్న పోలీసులు



దుబ్బాక టౌన్, ఆగస్టు 25, మనం న్యూస్ః వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైన సంఘటన దుబ్బాక మండలం రఘోత్తంపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. దుబ్బాక సిఐ మున్నూరు కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రఘోత్తంపల్లి గ్రామానికి చెందిన కంతుల దేవయ్య (50) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా డు. ఈ క్రమంలో ఈనెల 22వ తేదీన ధర్మాజీపేటలో ఉన్న బంధువు ల ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన కుమారుడు తండ్రి ఇంట్లో లేకపోవడంతో బంధువులకు ఫోన్ చేయగా అక్కడికి రాలేదని వారు తెలిపారు. దీంతో గత రెండు రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి గాలించగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం దుబ్బాక పోలీస్ స్టేషన్లో దేవయ్య కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఫిర్యాదు చేశారు.

# అతి తక్కువ కాలంలోనే ఆలయ అభివృద్ధి హర్షనీయం

### వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి భాస్కర్‌రెడ్డి దంపతులు

### ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జడ్జికి సన్మానం

దుబ్బాక, ఆగస్టు 25, మనం న్యూస్ః అతి తక్కువ కాలంలోనే దుబ్బాక శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం భక్తుల నామస్మరణతో మారుమ్రోగడం ఎంతో సంతోషంగా ఉందని హైకోర్టు జడ్జి చాడా భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక బాలాజీ ఆలయం ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా స్వామి వారిని హైకోర్టు జడ్జి దంపతులు దర్శించుకోగా వారికి ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు హైకోర్టు జడ్జి భాస్కర్‌రెడ్డి దంపతులకు శాలువాతో సన్మానించి ఆలయ మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక బాలాజీ ఆలయం రోజురోజుకు అభివృద్ధి చెందడమే కాకుండా ఎంతో సుదూర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.

–ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు శ్రీ బాలాజీ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం 8 గంటలకు స్వామి వారికి శాంతిపాఠం, వేద విన్నపం, ద్వార తోరణ పూజ, మూర్తి కుంభారాధన, నిత్యహోమం, మూలమంత్ర హోమం, నిత్య పూర్ణాహుతి, బలిహారం నిర్వహంచారు.



అనంతరం మహిళలచే మహాలక్ష్మి కుంకుమార్చన, మంగళశాసన తీర్థ ప్రసాద గోష్టి, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, ద్వార తోరణ పూజ, నిత్య హోమం రాయబారం, ఎదుర్కోలు ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మి నరసింహాచార్యులు తెలిపారు. అనంతరం మహిళలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి శనివారం 300 మంది భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.





# నీలం మధుకు అన్ని కుల సంఘాల మద్ధతు

### మద్ధతు తీర్మానం చేసిన చిట్కుల్ ముదిరాజ్ సంఘం

### గొంతెత్తి జై కొట్టిన సబ్బండ వర్గాలు

పటాన్‌చెరు, ఆగస్టు 25, మనం న్యూస్ః పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ త్రుటిలో చేజార్చుకున్న నీలం మధు ముదిరాజ్‌కు సబ్బండ వర్గాల మద్ధతు రోజురోజుకు పెరుగుతుంది. బహుజన బిడ్డ నీలం మధు ముదిరాజ్ బరిలో ఉండాల్సిందేనంటూ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు మద్ధతు తెలుపుతున్నారు. అందుకు అనుగుణంగా నీలం మధుకు మద్ధతు ప్రకటిస్తూ తీర్మానాలు చేయడానికి సిద్ధమవుతున్నారు. చిట్కుల్ గ్రామంలో ముదిరాజ్ సంఘం నుండి నీలం మధుకు మద్ధతుగా తీర్మానం చేస్తూ తొలి అడుగు పడింది. తమ అభిమాన నాయకుడు నీలం మధును జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గారెల శ్రీను ఆధ్వర్యంలో చిట్కుల్ ముదిరాజ్ సంఘం మూకుమ్మడిగా నీలం మధుకు మద్ధతిస్తూ తీర్మానం చేసింది. 60 లక్షల జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గాన్ని కేసీఆర్ విస్మరించడం సరికాదని వారు గొంతెత్తారు. సీఎం కేసీఆర్ మరోసారి ఆలోచించి పటాన్‌చెరు నియోజకవర్గ టికెట్ నీలం మధు ముదిరాజ్‌కే కటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపి గెలిపిస్తామన్నారు. అదేవిధంగా మరిన్ని బిసి కుల సంఘాలు నీలం మధుకు మద్ధతుగా తీర్మానాలు చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ముదిరాజ్ సామాజిక వర్గానికి టికెట్ కేటాయించాలని రాష్ట్ర



వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్తులు అన్ని గ్రామాల్లో తీర్మాణం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మన్నె చంద్రయ్య, తలారి నగేష్, ఉప్పరి నర్సింలు, దుబ్బ రాములు, కట్టమీది మల్లేష్, కట్టమీది వీరస్వామి, నీలం విష్ణు, తలారి శేఖర్, తలారి జంగయ్య, కట్టమీది వెంకటేష్, శ్రీను, రాజు, సంజీవ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.